క్లుప్తంగా

వృద్ధులకు రగ్గుల పంపిణీ



మేభలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

హుకుంపేట: మండలంలోని భీమవరం పంచాయతీలో మేభ, గంగరాజుపుట్టు గ్రామల్లో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శనివారం పర్యటించారు. ఈ నేపథ్యంలో లవ్ అండ్ కేర్ క్రైస్తవ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పేద గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శీతాకాలంలో పేద గిరిజనులు చలి నుంచి రక్షణ పొందేందుకు గాను రగ్గులు పంపిణీ చేయడం చాలా సంతోషకరమని కొనియాడారు. భవిష్యత్‌లో పేదలకు అన్ని విధాలుగా సేవలు చేయాలని ఆయన కోరారు. అనంతరం కొట్నాపల్లి పంచాయతీలో ఓ గిరిజనుడు అనారోగ్యంతో మృతి చెందినట్టు విషయం తెలుసుకుని అక్కడకు వెళ్లి కుటుంబానికి పరామర్శించారు. జీకే మండల సర్పంచ్ వర్తన ఈశ్వరమ్మ, నైని సన్నిబాబు, నాయకులు శివరామకృష్ణ, మాధవరావు పాల్గొన్నారు.

సర్పంచ్ అర్జున్‌కు చెట్టి వినయ్ పరామర్శ



అర్జున్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, నాయకులు

పాడేరు రూరల్: ముంచంగిపుట్టు మండలం కరిముక్కిపుట్టు పంచాయతీ సర్పంచ్ జి.అర్జున్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడి పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అరకు ఎంపీ తనూజారాణి భర్త , వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పార్టీ శ్రేణులతో కలిసి శనివారం ఆయనను పరామర్శించి, ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఎటువంటి సమస్య వచ్చిన తనను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మారావు, రాజు, సింహాచలం తదితరులున్నారు.

అంత్యక్రియలకు వితరణ



అంత్యక్రియలకు వితరన అందిస్తున్న దృశ్యం


ఎటపాక: మండలంలోని చోడవరం గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దిగూడెం గ్రామంలో మృతి చెందిన ఒకరి కుటుంబానికి జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వితరణ అందజేశారు. గ్రామంలో సొందె చిలకమ్మ అనే గిరిజన మహిళ అనారోగ్యంతో మృతి చెందారు.నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం చేయాలనే సంకల్పంతో ట్రస్టు ఆధ్వర్యంలో రూ.5వేల నగదు అందజేశారు. వీరాస్వామి, కణితి మధు, రత్నకుమార్, రాంప్రసాద్, చలపతి తదితరులున్నారు.

యూటీఎఫ్ సభలపై ప్రచారం



జైపూర్ జంక్షన్ వద్ద ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

డుంబ్రిగుడ: మండలంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించే స్వర్ణోత్సవ మహాసభలను విజయవంత చేయాలని కోరుతు అరకులోయ నుంచి పాడేరు వరకు రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ప్రచార యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న జైపూర్ జంక్షన్ వద్ద ఉన్న గిరిజన బాలికల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో సంఘం ముందుదన్నారు. స్వర్ణోత్సవాల మహాసభలకు ప్రతి ఒక్క యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొవాలని పిలుపునిచ్చారు. నేతలు బాలకృష్ణ, కన్నయ్య, రఘనాథ్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల శ్లాబ్ దుస్థితి



శిథిలావస్థలో చినగార్లపాడు పాఠశాల భవనం

పాఠశాలలు ఇలా.. చదువులు ఎలా?

- శిథిలావస్థలో సర్కారు బడులు
- పెచ్చులూడిన శ్లాబ్, ఊడిపోతున్న కిటీకీలు, తలుపులు
- వర్షం పడితే గదులన్నీ జలమయం
- విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

గంగవరం : మండలంలో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల (జీపీఎస్) భవనాల దుస్థితి చాలా అధ్వానంగా ఉంది. పలు భవనాలు దుస్థితి చాలా దారుణంగా ఉంది. అవి ఎప్పుడు కూలిపోతాయోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 15 గ్రామాల్లో గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నిర్వహిస్తోంది. వీటిలో చినగార్లపాడు, పిండికొండవీధి, ఎర్రంపాలెం, పోతందొరపాలెం, వేమనాపల్లి జీపీఎస్ భవనాలు చాలా దారుణంగా ఉన్నాయి. ఈ భవనాలు పూర్తిగా శిథిలస్థితిలో చేరుకున్నా ఆ భవనాల్లో భయం భయంగా తరగతులు నిర్వహిస్తున్నారు. చినగార్లపాడు జీపీఎస్ పాఠశాలకు గల రెండు భవనాలు ఉండగా వాటిలో ఒక భవనం పూర్తిగా శిథిలమై వినియోగంలో లేదు. ఉన్న ఒక్క భవనం శ్లాబ్‌లు పెచ్చులు ఊడిపడుతున్నాయి. గోడలు బీటలు వారి, కిటికీలు, తలుపులు చెడిపోయి ఉన్నాయి. వర్షం వస్తే చాలు ఈ భవనం పూర్తిగా కారిపోయి వర్షపు నీరుతో నిండిపోతోంది. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడి మరీ ఈ పాఠశాలను నిర్వహించారు. ఈ భవనం కూడా ఎప్పుడు కూలిపోతుందోననే భయాందోళన చెందుతున్నారు. గతంలో నాడు–నేడు ద్వారా పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరిగినట్టు పలువురు చెబుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో టి.మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా మండలంలో అధ్వాన్నంగా ఉన్న పాఠశాలల భవనాల దుస్థితిని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు.

చర్యలు తీసుకోవాలి



శిథిలాస్థితిలో ఉన్న చినగార్లపాడు జీపీఎస్ పాఠశాలకు నూతన భవనాలు మంజూరు చేయాలి. శిథిలావస్థలో ఉన్న భవనాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. తక్షణమే ఐటీడీఏ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కోసు బాబూరావు దొర, చినగార్లపాడు

తల్లిదండ్రుల ఆందోళన



పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. పాఠశాల భవనం దారుణంగా ఉంది. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది.

– కె.లక్ష్మి, చినగార్లపాడు

పాఠశాలను అభివృద్ధి చేయాలి



మా గ్రామంలో గల పాఠశాలను అభివృద్ధి చేయాలి. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాలు స్థానే కొత్త భవనాలు నిర్మించాలి. ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠశాలకు ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించాలి.

– మదకం వెంకటలక్ష్మి, చినగార్లపాడు

ధాన్యం పనుల్లో రైతులు నిమగ్నం



రాజవొమ్మంగిలో ఎండలో ఆరబెట్టిన ధాన్యం

రాజవొమ్మంగి: మండలంలో గత రెండు రోజులుగా వర్షాలు తగ్గి ఎండ కాస్తుండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఖరీఫ్ వరి పంట పక్వానికి వచ్చి కోతలు మొదలైనప్పటి నుంచి ఏజెన్సీ రైతులు మూడుసార్లు తుపాను పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో కోతలు పూర్తికాగా, నేటికి సగం పంట పొలాల్లో, కల్లాల్లోనే ఉన్నట్టు పలువురు చెబుతున్నారు. పండిన పంటను బస్తాలకు ఎత్తి ఇంటికి తెచ్చుకొందామన్నా, కొనుగోలు కేంద్రాల్లో అమ్ముదామన్నా తుపాను, వాతావరణ ప్రభావం రైతులకు పెద్ద ప్రతిబంధకంగా మారింది. కాగా అకాల వర్షాలు తగ్గి రెండు రోజులుగా ఎండ కాస్తుండడంతో కుప్పలుగా వేసిన వరి పంట నూర్పే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మరి కొన్ని చోట్ల రాశులుగా పోసిన ధాన్యాన్ని ఎండలో ఆరబెడుతున్నారు. గింజలో తేమశాతం తగ్గగానే కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తుతున్నారు. మొత్తం మీద పొడి వాతావరణం ఉండడంతో రైతులు ధాన్యం బస్తాలకు ఎత్తి ఇళ్లకు తెచ్చుకొంటున్నారు. మరి కొంతమంది కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. తుపాను గండం గట్టెక్కడంతో ఆనంద పడుతున్నారు.

గండి పోశమ్మ ఆలయం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: దేవీపట్నం మండలం గండిపోశమ్మ అమ్మవారి ఆలయం 2025 క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ కల్పశ్రీ శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీకుమార్, సీనియర్ అసిస్టెంట్ సూరిబాబు, పూజారి వెంకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

- అరకొరగా అధికారులు హాజరు
- ముందస్తు సమాచారం, ప్రకటన లేకుండా మీటింగ్ నిర్వహణ
- ఎంపీడీవో తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరి

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ సమావేశం గుట్టుచప్పుడుగా నిర్వహించి ఎటువంటి సమస్యలు పరిష్కారానికి తీర్మాణాలు చేయలేదు. ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన సమావేశం జరిగింది. మండల గ్రామాల అభివృద్ధికి అజెండగా నిలిచే సమావేశంలో తూతూ మాంత్రంగా అధికారులు హాజరుకావడం సరికాదని, ఎంపీడీవో సమాచారం, పత్రిక ప్రకటలు లేకుండా నిర్వహించడం సరికాదని, ఎంపీడీవో, అధికారుల తీరుపై కలెక్టర్ ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. మండల అధికారిగా ఉన్న ఎంపీడీవో స్పష్టమైన సమాధానం ఇవ్వాలని పట్టుబడ్డారు. కొర్రాయి పంచాయతీల్లో ప్రతిపాదించిన పనులు జరగడం లేదని సర్పచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటికి నిధులు వెచ్చించనున్నామన్నారు. అధికారుల తీరు మార్చుకోవాలని లేనిపక్షంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎంపీపీ హెచ్చరించారు. జెడ్పీటీసీ చటారి జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి.ఆనంద్‌రావు, లలిత, ఎంపీటీసీలు, విజయ, వరహాలమ్మ జెమ్మ, రామారావు, సర్పంచ్‌లు జి.శారద, జి.నాగేశ్వరరావు, కొములు, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మిరేవుల బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

గూడెంకొత్తవీధి: నర్సీపట్నం నుంచి గుమ్మిరేవుల ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రతి రోజూ ఉదయం నర్సీపట్నం నుంచి బయలుదేరి గూడెంకొత్తవీధి మండలం గుమ్మిరేవుల వెళ్లే ఈ బస్సు స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ప్రధానంగా నర్సీపట్నం నుంచి చింతపల్లి, గూడెంకొత్తవీధి, మండలాల్లో దారకొండ వరకూ వెళ్లే సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర వైద్య సిబ్బందితో పాటు ఉద్యోగులు, వ్యాపారులకు ఈ సర్వీసుతో ఎంతో ఉపయోగపడేది.

గత సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు గూడెంకొత్తవీధి మండలంలోని పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. కల్వర్టులు కూలిపోయాయి. అప్పటి నుంచి ఈ మార్గంలో గుమ్మిరేవుల బస్సు సర్వీసును రద్దు చేశారు. ప్రస్తుతం ఈ మార్గంలో రాకపోకలు సాగుతున్న బస్సు సర్వీసును పునరుద్ధరించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుమ్మిరేవుల బస్సు సర్వీసును పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పరశురాయుడుకు ఘన నివాళి



పరశురాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు, ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: ఉపాధ్యాయుడు అరిసెల పరశురాయుడు విద్యావృత్తికి అందించిన సేవలు మారువలేనివని సర్పంచ్ ఎస్.సుభాష్‌చంద్ర అన్నారు. మండల కేంద్రంలో ముంచంగిపుట్టు పాఠశాల ప్రథమ ఉపాధ్యాయుడు పరశురాయుడు వర్ధంతిని శనివారం వివిధ పార్టీల నేతలు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో ఉన్న పరశురాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.10వ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుభాష్‌చంద్ర మాట్లాడుతూ ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్పించిన ఆదర్శమూర్తి పరశురాయుడు అని అన్నారు. ఉపాధ్యాయులు సత్యారావు, భీమన్న, ప్రసన్న, శ్రీను, గున్నయ్య, సత్యానందం, రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రసాద్‌పడాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న భక్తులు తొలుత ఆలయంలో దీపారాధన చేసి పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో దేవుడి చిత్రపటాలతో తిరుగుతూ సంకీర్తన చేశారు. భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంతో పల్లె పరవశించింది.

ఉపమాక వెంకన్నకు గరుడ వాహన సేవ



స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ఇత్తడి గరుడ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ముందుగా కొండపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, నిత్యపూజలు నిర్వహించారు. దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, స్వామి వారి ఉత్సవమూర్తులకు, గోదాదేవి అమ్మవారి సన్నిధిలోను, ఉపాలయాల్లో నిత్యార్చనలు నిర్వహించిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఇత్తడి గరుడ వాహనం పైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ధనుర్మాసం శనివారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి తిరువీధి సేవల్లో పాల్గొన్నారు. పూజాదికాల అనంతరం తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం జరిగింది. అర్చక స్వాములు వరప్రసాద్, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి ఆచార్యులు రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

వ్యాన్ బోల్తా: పలువురికి గాయాలు



పూసుగూడెం వద్ద బోల్తా పడిన వ్యాన్

కూనవరం: కూలీలతో వెళ్తుతున్న వ్యాన్ బోల్తాపడి పలువురికి గాయాలైన సంఘటన కొండ్రాజుపేట పంచాయతీ, పూసుగుగూడెం మలుపు వద్ద శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. చింతూరు మండలంలోని పేగ పంచాయతీ, అల్లిగూడెం గ్రామానికి చెందిన వలస కూలీలు, కూనవరం మండలానికి చెందిన ఓ రైతు వద్ద కూలి పనులకు వచ్చారు. పనులు ముగిసాక సాయంత్రం వ్యాన్‌లో కూలీలు తిరిగి వెళ్తుండగా మండల పరిధిలోని పూసుగు గూడెం సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో సుమారు 9 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోతులగుట్ట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంలో మురికి చొక్కయ్య తలకు బలమైన గాయం కావడంతో భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసినట్టు సీహెచ్‌సీ వైద్యుడు వివేక్ నాయక్ తెలిపారు. మిగిలిన వారికి స్వల్పగాయాలైనట్టు చెప్పారు. కాగా వ్యాన్‌లో సుమారు 30 మందిపైగా కూలీలు ఉన్నట్టు తెలిసింది.

విద్యార్థుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, తదితరులు

పాడేరు రూరల్: స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశే ఖర్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పెడింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఈ మేరకు విద్యార్థుల సమస్యలపై ఈ నెల 30న విజయవాడలో చేపట్టనున్న ధర్నాకు విద్యార్థులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల వసతి గృహల్లో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని వరుస మరణాలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులపై అత్యాచారాలు, దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పూర్తి రక్షణ కల్పించాలన్నారు. వసతిగృహాల్లో హెల్త్ వలంటీర్లను నియమించాలని కాస్మోటిక్స్, ప్రోత్సా హకాలు అందించాలన్నారు. పీజీ, ఇంజినీరింగ్ పై చదువులు చదువుతున్న విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్–77ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణ, తనీష్, సౌజన్య, దేవి, సునీత, చంటి, జీవన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఎంపీడీవో సాయిహర్షకు నీటి సమస్యపై వినతిపత్రం అందజేస్తున్న మినుములపుట్టు గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ మినుములపుట్టు గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని గిరిజన మహిళ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరి, విజయలు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో శ్రీ సాయిహర్షను గిరిజన మహిళ సంఘం ఆధ్వర్యంలో మినుములపుట్టు గ్రామస్తులు కలిసి, నీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. గత 15రోజులుగా తాగునీటి పైపులైన్ మరమ్మతుకు గురికావడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నామన్నారు. గ్రామంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ నీటి పనులు సైతం చాలా రోజులుగా అసంపూర్తిగా ఉన్నాయన్నారు. దీంతో నీటి కష్టాలు పడుతున్నామని వెంటనే గ్రామంలో నీటి సమస్య తీర్చాలని మహిళ సంఘం అధ్యక్షురాలు ఈశ్వరి, మినుములపుట్టు గ్రామ మహిళలు రాజేశ్వరి, భానుమతి, సునీత, రోహిణి, ప్రమీలా తదితరులు కోరారు. దీనిని స్పందించిన ఎంపీడీవో శ్రీ సాయిహర్ష మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూస్ శాఖ అధికారులతో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు.

పీసా కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు: వచ్చే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ మధ్యలో జరగనున్న పీసా కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు.ఆయన కార్యాలయంలో శనివారం పీసా కమిటీలకు ఎన్ని కల నిర్వాహణపై 47 మంది ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు.దీనిలో పాల్గొన్న ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికలు ఎలా నిర్వహించాలో వివరించారు. ఎలాంటి లోపాలు లేకుండా దీనిని నిర్వహించాలన్నారు.మొత్తం 47 కమిటీలకు ఎన్నికలు ఉంటాయన్నారు.సిబ్బంది కొరత కావడంతో మండల స్థాయి అధికారులతో పాటు కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్నికల అధికారులుగా నియమించామని ఎంపీడీవో విలేకరులకు తెలిపారు. డీటీ కుమారస్వామి మాట్లాడుతూ పూర్తి వివరాలు చెప్పారు. ఏవో బాల మురళీ కృష్ణ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరం



కళాశాల ప్రిన్సిపాల్ వసుధతో పూర్వ విద్యార్థులు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అలూమిని అసోసియేషన్ సమావేశం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె వసుధ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలు ఎంతో అవసరముందన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి చక్రపాణి, మహిళా కార్యదర్శి అపర్ణ, శ్రీనివాస్, విశ్వరాజ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థులు చెప్పారు.

బెంచీల వితరణ



తహసీల్దారు కార్యాలయంలో బెంచీలను వితరణ చేస్తున్న దాతలు

చింతపల్లి: చింతపల్లిలో తహసీల్దారు కార్యాలయం, ఆస్పత్రిలో ప్రజలు కూర్చొని సేదతీర్చుకునే విధంగా సిమెంటు బెంచీలను వితరణగా అందించారు. తహసీల్దారు కార్యాలయంలో కొన్నేళ్లపాటు విధులు నిర్వహించిన మడగల ఆనందరావు జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు జ్యోతి, సూర్యనారాయణ తదితరులు ఈ సేవ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా తహసీల్దారు కార్యలయంలో– 2, ఏరియా ఆస్పత్రిలో–2, ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో– ఒక బెంచీలను వితరణగా అందించారు. సర్పంచ్ దురియా పుష్పలత, హేమంత్ కుమార్, జోగిరాజు, శ్రీను, గణేష్ తదతరులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరకుల పంపిణీ



పేదలకు సరకులు అందజేస్తున్న కృష్ణార్జునరావు

కూనవరం: మండలంలోని భీమవరం గ్రామంలో పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులను కృష్ణార్జున ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కాకునూరి కృష్ణార్జునరావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తుల సమయంలో కృష్ణార్జున ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. సాయి రిషిత్, నందకిషోరు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో ఆరోగ్యకర పంటల దిగుబడి

దేవరాపల్లి: ఆధునిక పద్ధతుల్లో తక్కువ మోతాదులో యూరియా, పురుగుల మందులను వినియోగించి సాగు చేయడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు దిగుబడి వస్తాయని చోడవరం ఏడీఏ వి.రవీంద్రనాథ్ అన్నారు. ఆధునిక పద్ధతుల్లో పండించిన కొత్తపెంటకు చెందిన 21 మంది రైతుల నుంచి వరి విత్తన నమూనాలను సేకరించే కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన విత్తన నమూనాలను బెంగళూరులోని విత్తన ధ్రువీకరణ పరిశోధన సంస్థకు పంపిస్తామన్నారు. వీటి నాణ్యత బాగున్నట్లు రిపోర్టు వస్తే సదరు రైతులంతా ఆన్‌లైన్‌లో వరి విత్తనాలు విక్రయించుకోనే అవకాశం లభిస్తుందన్నారు. మార్కెట్లో మంచి గిట్టుబాటు ధర కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.